




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
శనివారం 14 మార్చి 2026 పేజీలు 8


# అన్నదాతకు కూటమి భరోసా

- 46.85 లక్షల రైతుల ఖాతాల్లోకి రూ.2,670 కోట్ల జమ
- ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందించి అండగా నిలిచాం
- వ్యవసాయానికి అండగా త్వరలో ఏఐ అగ్రానమిస్ట్ సేవలు
- గత పాలకులు తప్పులు చేసి గ్యాగ్ ఆర్డర్లు తెచ్చుకోవటం సిగ్గుచేటు
- పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ మూడోవిడత నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు





**గన్నవరం, మార్చి 13, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలోని రైతు సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఏడాదిలో ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించిన ఏకైక ప్రభుత్వం తమదేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం సూరంపల్లిలో జరిగిన 'పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ' మూడో విడత నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గౌహతీ నుంచి ప్రధాని మోదీ ప్రసంగాన్ని రైతులతో కలిసి వర్చువల్ గా వీక్షించారు. ప్రధానమంత్రితో కలిసి సీఎం రాష్ట్రంలోని 46.85 లక్షల మంది రైతులకు రూ.2,670 కోట్లను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా రైతులకు అండగా నిలుస్తున్నాం. కేంద్రం ఇచ్చే రూ. 6 వేలకు తోడు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు ఈ ఏడాది రైతులకు అందించాం. గత ప్రభుత్వం కేవలం రూ.7,500 ఇచ్చి చేతులు దులుపుకుంటే, మేము ఆ మొత్తాన్ని రెట్టింపు కంటే ఎక్కువ చేసి ఇస్తున్నాం. ఈ ఒక్క విడతలోనే రాష్ట్ర వాటాగా రూ. 1,874 కోట్లు విడుదల చేశాం." మొత్తం మూడు విడతల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.8,985 కోట్లు జమ చేశాం. వచ్చే వారం రోజుల్లో ప్రతీ రైతు ఇంటికీ ప్రజాప్రతిధులు వచ్చి మీ యోగక్షేమాల్ని అడిగి తెలుసుకుంటారు. ప్రస్తుతం యుద్ధ ప్రభావం వల్ల అరటి, గుడ్లు లాంటి వ్యవసాయ, పౌల్ట్రీ ఉత్పత్తులకు మిగతా 2లో...

## నందిగామలో.. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్



- అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రీయ విద్యాలయ సంఘటన్
- ఎంపీ కేశినేని శివనాద్ కృషితో నెరవేరిన నందిగామ వాసుల చిరకాల వాంఛ
- 2026 -27 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లకు అనుమతి

వివరాలు 2లో...

## పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

7లో

- నో మొబైల్ జోన్లుగా పరీక్షా కేంద్రాలు
- 9154970454 నంబరుతో జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్ : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

## రైతు ఆనందంతో సమాజం ఆనందం

2

- రైతు సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం చరిత్రలో నిలబడదు
- రైతు సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టిన గత వైసీపీ ప్రభుత్వం
- రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి
- ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు



## వంట గ్యాస్ కొరత లేదు



- వినియోగదారులు ఆందోళన చెందనవసరం లేదు
- వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం
- బాట్లింగ్, సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేదు
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు 7
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

## నో గ్యాస్...

2లో

- కట్టెల పొయ్యే ఆధారం... కట్టెల రేట్లకు రెక్కలు.
- తీవ్ర కొరతతో హోటళ్లకు ఇబ్బందులు



# నో గ్యాస్...

**కట్టెల పొయ్యే ఆధారం... కట్టెల రేట్లకు రెక్కలు.**

**తీవ్ర కొరతతో హోటళ్లకు ఇబ్బందులు**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఇరాన్ యుద్ధ ప్రభావం వల్ల నగరంలో గ్యాస్కు తీవ్ర కొరత ఏర్పడింది. ఎక్కడ చూసినా నో స్టాక్ బోర్డులు దర్శన మిస్తున్నాయి. ముఖ్యంగా వాణిజ్య అవసరాలకు సంబంధించి గ్యాస్ సిలిం డర్లకు తీవ్ర కొరత వేధించడం వల్ల హోటల్ నిర్వాహకులు నానా ఇబ్బం దులు పడుతున్నారు. చాలా రెస్టారెంట్లు ఇప్పటికే కట్టెలపై పై ఆధారప డుతున్నాయి. నగరంలో కట్టెలకు కూడా కొరత ఏర్పడింది. దొరికే అమాత్రం కట్టెలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో గ్యాస్ సరఫరాలో ఏర్పడిన కొరత రెస్టారెంట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. హోటళ్లలో వేడి వేడి పదార్థాలు తయారు చేసేందుకు అవసర మైన కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందుబాటులో లేకపోవ డంతో యాజమాన్యాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. గ్యాస్ కొరత కారణంగా నగరంలోని అనేక హోటళ్లు, చిన్న చిన్న రెస్టారెంట్లు కట్టెల పొయ్యిలను వినియోగిస్తూ వంట పనులను నిర్వహించాల్సిన పరిస్థితి నెల కొంది. సాధారణంగా గ్యాస్ స్టవ్‌లపై వేగంగా తయారయ్యే వంటకాలు ఇప్పుడు కట్టెల పొయ్యిలపై ఎక్కువ సమయం తీసుకుంటుండటంతో హోటల్ నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ సరఫరాలో అంతరాయం వల్ల వ్యాపారంపై ప్రభావం పడుతుందని హోటల్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కట్టెల పొయ్యిల వినియోగం వల్ల ఖర్చులు పెరగడంతో పాటు పని భారమూ పెరుగుతోందని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా గ్యాస్ సరఫరా పరిస్థితి సాధారణ స్థితికి రావాలని, లేకపోతే హోటల్ వ్యాపారంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్


**అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రీయ విద్యాలయ సంఘటన**

**ఎంపీ కేశినేని శివనాథ్ కృషితో నెరవేరిన నందిగామ వాసుల చిరకాల వాంఛ**

**2026 -27 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లకు అనుమతి**

**విజయవాడ మార్చి 13, మేజర్ న్యూస్ :** నందిగామ ప్రాంత వాసుల చిరకాల వాంఛ నెరవేరబోతుంది. నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ గ్రీన్ సిగ్నల్ ఇస్తూ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని ) స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య సహకారంతో విశేష కృషి చేశారు. నందిగామలో కేంద్రీయ విద్యాలయాన్ని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి సైతం ఎంపీ విజ్ఞప్తి చేశారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పా టుకు నియోజకవర్గంలోని పల్లగిరి ప్రాంతంలో 5 ఎకరాల మేర స్థల గుర్తిం పు ఆ స్థలాన్ని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ కు చర్యలు చేపట్టారు. ఇటీవల సైతం స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య, రెవిన్యూ ఉన్నతాధికారులతో కలిసి స్థల పరిశీలనను ఎంపీ కేశినేని శివనాథ్ చేశారు. ఎంపీ కేశినేని చిన్ని విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వ కేంద్రీ య విద్యాలయ సంగటన్ నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఏర్పా టుకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా 85 కొత్త కేంద్రీ య విద్యాలయాలను ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆమోదముద్ర వేయగా వాటిలో నందిగామలో కేంద్రీయ విద్యాలయం ఒకటిగా ఉంది. 2026 – 27 విద్యా సంవత్సరం నుంచి నందిగామ కేంద్రీయ విద్యాలయం లో అడ్మిషన్లకు అనుమతి ఇచ్చిన కేంద్రీయ విద్యాలయ సంఘటన్ తాత్కాలికంగా నందిగామలోని మహిళా పాలిటెక్నిక్ ట్రైనింగ్ సెంటర్ నందు కేంద్రీయ విద్యాలయం నిర్వహణకు అనుమతి ఇచ్చింది. ఈ విద్యాలయం ద్వారా 2026–27 విద్యా సంవత్సరంలో 1 నుంచి 5 వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతాయని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అడిషనల్ కమిషనర్ (అడ్మిన్ ) దీపేష్ గెహ్లోట్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాత్కాలిక వసతి, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల కేటాయింపులు తదితర ఏర్పాట్లు జరిగిన వెంటనే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అనుమతి ఇచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి యువనేత నారా లోకేష్ కు ఎంపీ కేశినేని చిన్ని ధన్యవాదాలు తెలిపారు.

# అన్నదాతకు కూటమి భరోసా



(మొదటిపేజీ తరువాయి)

ఇబ్బంది ఏర్పడుతోందని.. ప్రత్యామ్నాయ మార్కెట్ల లను పరిశీలిస్తున్నామని అని ముఖ్యమంత్రి అన్నారు.

**అగ్రిటెక్ - భవిష్యత్ వ్యవసాయం**

"నేను రైతు బిడ్డను, వ్యవసాయంపై నాకు పూర్తి అవగాహన ఉంది. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని సుస్థిరం చేశాం. ఇప్పుడు రాష్ట్ర జీవనాడి పోలవరం పూర్తికి కంకణం కట్టుకున్నాం. గత పాల కుల నిర్లక్ష్యంతో డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయేలా చేశారు. ఇప్పుడు మళ్లీ రూ.1000 కోట్లతో దానిని నిర్మిస్తున్నాం. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తాం. వ్యవసాయంలో ఆధునీకరణ తీసుకురావడమే మా లక్ష్యం. డ్రోన్ల ద్వారా విత్తనాలు చల్లడం, డ్రిప్ ఇరిగేషన్ వంటి సాంకేతికతను ప్రోత్సహిస్తున్నాం. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయబోతున్నాం. ఇది రైతులకు ఆధునిక సాగు పద్ధతుల్లో మెరుగైన సలహాలిస్తుంది. అలాగే ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేస్తాం. మేము అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తెచ్చాం. కేవలం ఆర్థిక సా యమే కాకుండా, 47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి 24 గంటల్లోనే నగదు జమ చేస్తున్నాం. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ ను రూ. 1.50 కే ఇస్తున్నాం. సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత గ్యాస్ సిలిండర్లను తప్పకుండా అమలు చేస్తున్నాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**ధార్మిక సంస్థల పవిత్రతపై రాజీ లేదు**

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి గత పాలకులు ఘోర తప్పిదం చేశారని ముఖ్యమం త్రి వ్యాఖ్యానించారు. తప్పులు చేసి, పాపాలు చేసి, వాటి గురించి ఎవరూ మాట్లాడకూడదని కోర్టులకు వెళ్లి గ్యాగ్ ఆర్డర్లు తేవడం అలవాటుగా మార్చుకున్నారని ఆక్షేపించారు. వివేకా హత్య విషయంలోనూ ఇలాగే చేశారని .. తప్పు చేసిన వారు ప్రజల ముందు దోషులుగా నిలబడక తప్పదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ బాలశౌరి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు హాజరయ్యారు.

# వాంబేకాలనీలో ఉద్రిక్తత

**వైసిపి ఆవిర్భావ దినోత్సవం వేల వైఎస్ఆర్ దిమ్మ తొలగింపు**

**విజయవాడ మేజర్ న్యూస్ :** నగరంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. వాంబే కాలనీ స్కూల్ సెంటర్ వద్ద 2011లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా దిమ్మను టౌన్ ప్లానింగ్ సిబ్బంది ధ్వంసం చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ముందస్తు సమాచారం లేకుండా, భారీ పోలీసు బందోబస్తు మధ్య టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ దిమ్మను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి శ్రేణులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న విజయవాడ డిప్యూటీ మేయర్ అవుతూ శైలజ రెడ్డి, అవుతూ శ్రీనివాసరెడ్డి అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి, ప్రతిపక్ష పార్టీల జెండా దిమ్మెలను పడగొట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, గత 15 ఏళ్లుగా ఉన్న దిమ్మెను ఇప్పుడు తొలగించడం కేవలం రాజకీయ కక్ష సాధింపేనన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేళ కార్యకర్తలు ఉత్సాహంగా జెండా ఎగురవేస్తుంటే, ఆ ఉత్సాహాన్ని జీర్ణించుకోలేక ఇలాంటి



చర్యలకు పాల్పడ్డారు. ఒకవేళ అది రోడ్డుకు అడ్డంగా ఉంటే నాయకులకు చెప్పి చర్యలు తీసుకోవాలి కానీ, పోలీసుల అండతో దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. బయట ఉన్న దిమ్మెలను తొలగించగలరేమో కానీ, ప్రజల గుండెల్లో ఉన్న పార్టీ జెండాను ఎవరూ తొలగించలేరన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి మంచి పరిపాలన అందించడంపై దృష్టి పెట్టలన్నారు.

**పునర్నిర్మాణం:** "ఇలాంటి దౌర్జన్యాలకు భయపడే ప్రసక్తే లేదు. మళ్లీ అదే స్థలంలో జెండా దిమ్మెను నిర్మించి తీరుతామన్నారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో పోలీసులు పహారా కాస్తున్నారు. వైసిపి కార్యకర్తలు ఆందోళనను ఉధృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దిమ్మను పునర్నిర్మాణం చేశారు.

# రైతు ఆనందంతో సమాజం మొత్తం ఆనందం

**విజయవాడ సెంట్రల్, మేజర్ న్యూస్ :** శుక్రవారం సాయంత్రం బీఆర్టీసీ రోడ్డు లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసన సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ రైతు ఆనందంగా ఉంటే సమాజం మొత్తం ఆనందంగా, సుఖంగా ఉంటుందని తెలిపారు. రైతు సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం చరిత్రలో నిలబడదని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్ర ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి కేవలం 11 సీట్లకు మాత్రమే పరిమితం చేశారని విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని కాపాడే బాధ్యతను గుర్తించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, రైతుకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించే దిశగా చర్యలు చేపట్టిందని అన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నిధులను విడతల వారీగా అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రెండు విడతల్లో రూ.6,309 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయగా, ఇప్పుడు మూడో విడత నిధులను పీఎం కిసాన్ నిధులతో కలిపి ప్రతి రైతు ఖాతాలో రూ.6,000 చొప్పున జమ చేస్తున్నామని వెల్లడించారు. ఈ పథకం రైతుల జీవితానికి నమ్మకంగా నిలుస్తూ, వ్యవసాయ పెట్టుబడులకు తోడ్పడేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద సంవత్సరానికి రూ.6,000 అందిస్తుం డగా, రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.14,000 అంది స్తోందని తెలిపారు. ఈ విధంగా మొత్తం కలిపి ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20,000 అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ.14,000ను మూడు విడతల్లో జమ చేస్తుండగా మొదటి విడతలో రూ.5,000, రెండవ విడతలో రూ.5,000, మూడవ విడతలో రూ.4,000 రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6,000ను మూడు విడతల్లో రూ.2,000 చొప్పున జమ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46,85,838 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలవడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని బొండా ఉమా తెలిపారు. రైతులకు సరిపడా ఎరువులను సబ్సిడీ ధరలకు అందిస్తూ ఎటువంటి కొరత లేకుండా కేంద్రంతో సమన్వయం చేస్తూ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులకు వ్యవసాయ పరికరాలను అందిస్తూ వ్యవసాయ రంగంలో సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యం చెంది పాడైపోయిన కాలువలను మరమ్మతు చేసి చివరి ఎకరానికి నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీటి సౌకర్యాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో రైతులు ధాన్యం అమ్మితే డబ్బులు రావడానికి నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతులు ధాన్యం అమ్మిన వెంటనే 24 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా వ్యవస్థను ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు అండగా నిలుస్తూ ఇన్‌పుట్ సబ్సిడీలుగా సుమారు రూ.310 కోట్లు అందించామని తెలిపారు. ఉల్లి, కోకో వంటి పంటలకు ధరల స్థిరీకరణ నిధి కింద రూ.588 కోట్లు ఖర్చు చేసి రైతులకు మద్దతు ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే 202627 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.53,752.12 కోట్లు కేటాయించడం ద్వారా రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యం ఇస్తుందో స్పష్టమవుతోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని ప్రచార కార్యక్రమంగా మాత్రమే మార్చిందని బొండా ఉమా విమర్శించారు. "వైఎస్సార్ రైతు భరోసా" పేరుతో పెద్దఎత్తున ప్రచారం చేసినప్పటికీ అందులో ఎక్కువ భాగం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులేనని అన్నారు. సంవత్సరానికి రూ.12,500 ఇస్తామని చెప్పి వాస్తవానికి రూ.7,500 మాత్రమే ఇచ్చారని తెలిపారు. కేంద్రం ఇచ్చే రూ.6,000ను కూడా తమ పథకంగా చూపిస్తూ రైతులను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. దీంతో ఐదేళ్లలో ప్రతి రైతుకు సుమారు రూ.30,000 వరకు నష్టం జరిగిందని అన్నారు. పంట బీమా అమలు సరిగా జరగకపోవడం, రైతు భరోసా కేంద్రాలు ఉపయోగం లేకుండా ఉండిపోవడం వంటి సమస్యలు గత ప్రభుత్వంలో ఎక్కువగా కనిపించాయని పేర్కొన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చి రైతులకు అవసరమైన సేవలను అందించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిరంతరం రైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తోందని బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు.

# ప్యూర్పవర్ ఎలక్ట్రిషియన్లు, డీలర్ల కోసం ప్రత్యేక కార్యక్రమం నిర్వహణ





**విజయవాడ మేజర్ న్యూస్ :** ప్రాంతీయ ఎనర్జీ వ్యవస్థను బలపరచడానికి ప్యూర్పవర్ డిస్ట్రిబ్యూటర్ నెక్స్ట్ జెన్ ఎంటర్ప్రైజెస్ కొత్తగూడెం లోని హోటల్ థాటిపల్లిలో ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈ రెండు సెషన్ల కార్యక్రమం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల టెక్నికల్, వ్యాపార సమాజాన్ని కలిపేందుకు నిర్వహించబడింది. కార్యక్రమం ప్రారంభంలో స్థానిక ఎలక్ట్రిషియన్ల కోసం ఒక టెక్నికల్ సెమినార్ జరిగింది. ఈ ఎలక్ట్రిషియన్లు ప్రాంతంలో ఎనర్జీ ఇన్స్టాలేషన్లో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ సెషన్లో ప్యూర్పవర్ యొక్క ఆధునిక టెక్నాలజీ, ఏఐఎస్ 156 దశ 2 భద్రతా నియమాలు గురించి వివరించారు. అలాగే స్మార్ట్ గ్రిడ్ టెక్నాలజీ, సోలార్ ఫస్ట్ వ్యవస్థ గురించి కూడా సమాచారం ఇచ్చారు. తర్వాత సాయంత్రం ఒక ప్రత్యేక డీలర్ మీట్ జరిగింది. ఇందులో ముఖ్యమైన వ్యాపార భాగస్వాములు పాల్గొన్నారు. తెలంగాణలో వేగంగా పెరుగుతున్న పునరుత్పాదక శక్తి మార్కెట్ గురించి చర్చించారు. ప్యూర్పవర్ యొక్క "మేడ్ ఇన్ ఇండియా" హార్డ్వేర్ వినియోగదారులకు ఎనర్జీ స్వాతంత్ర్యం, తక్కువ విద్యుత్ ఖర్చు అందించగలదని వివరించారు. నెక్స్ట్ జెన్ ఎంటర్ప్రైజెస్ కు చెందిన విక్రమ్ మాట్లాడుతూ "ఈ కార్యక్రమం భవిష్యత్ ఎనర్జీని అర్థం చేసుకునే నిపుణుల సమాజాన్ని నిర్మించడానికి నిర్వహించాం. ఎలక్ట్రిషియన్లు, డీలర్లు కలిసి పని చేస్తే ప్రజలకు మంచి, నమ్మదగిన ఎనర్జీ పరిష్కారం అందుతుందన్నారు. కార్యక్రమం చివరలో అందరూ తమ ప్రాంతాల్లో ఎనర్జీ మార్పును ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. నెక్స్ట్ జెన్ ఎంటర్ప్రైజెస్ సహకారంతో ప్యూర్పవర్ తన భాగస్వాములకు నిరంతరం టెక్నికల్ ట్రైనింగ్, మంచి సపోర్ట్ అందిస్తుందని చెప్పారు.

### ఐరిష్ పబ్ సంస్కృతిని ప్రతిబింబించేలా

## ఐరిష్ ట్రయల్ పేరిట ఒక సరికొత్త వేడుకను ప్రారంభించిన రాయల్ ఛాలెంజ్






**అమరావతి, మార్చి 13, మేజర్ న్యూస్ :** రాయల్ ఛాలెంజ్ తన సరికొత్త విస్కీ బ్లెండ్ ఐరిష్ ట్రయల్ను ఒక అద్భుతమైన బార్ అనుభవంతో ప్రారంభించింది. హైదరాబాద్ మాదాపూర్లో కాక్ అండ్ బుల్ వేదికగా ఐరిష్ పబ్ అనుభవానికి ప్రతీకగా నిలిచే స్నేహం, అనుబంధం, సంగీతం వంటి అంశాలను ఈ వేడుక ప్రతిబింబించింది. ఈ ప్రారంభ వేడుకలో ఐరిష్ ట్రయల్ను వివిధ రకాలుగా ప్రదర్శించారు. ఇంటరాక్టివ్ షోకేస్ జోన్లు, బ్రాండెడ్ పబ్ గేమ్ల నుండి లైవ్ ఐరిష్ సింగాలాంగ్ ప్రదర్శనలు, ప్రత్యేకమైన కాక్టెయిల్స్ వరకు అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. అతిథులు ఆవిష్కరణ క్షణాన్ని వీక్షించడమే కాకుండా ఐరిష్ కాఫీ, ఐరిష్ ఓల్డ్ మెయిడ్, ఐరిష్ బక్, ఐరిష్ సోర్, పికిల్డ్ ట్రయల్ వంటి రకరకాల కాక్టెయిల్స్ను రుచి చూశారు. ఈ డ్రింక్స్ బ్లెండ్ వైవిధ్యతను, దానిలోని మృదుత్వాన్ని చాటి చెప్పాయి. రాయల్ ఛాలెంజ్ ఐరిష్ ట్రయల్ ప్రస్తుతం తెలంగాణలో మాత్రమే అందుబా టులో ఉంది. దీని ధరలు 750 మి.లీ కి 1360 రూపాయలు, 375 మి.లీ కి 680 రూపాయలు, 180 మి.లీ కి 340 రూపాయలుగా ఉన్నాయి.మరింత విస్తరిస్తోంది. డయాజియో ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రుచిరా జైట్లీ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ.. "ప్ర స్తుతం వినియోగదారులు మద్యం విషయం లో కొత్త రకమైన, అంతర్జాతీయ స్థాయి అనుభవాలను కోరుకుంటున్నారు. విస్కీ విభాగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అసలైన రుచి, మృదుత్వం, కొత్తదనం ఉండేలా చూసుకుంటున్నారు" అని పేర్కొన్నారు. డయాజియో ఇండియా రాయల్ ఛాలెంజ్ ఐరిష్ ట్రయల్తో తన ప్రీమియం ఉత్పత్తులను అంతర్జాతీయ విస్కీ శైలులను భారతీయ వినియోగదారులకు పరిచయం చేస్తూనే, నేటి కాలపు వేడుకలకు తగినట్లుగా సులభంగా నచ్చే మృదువైన రుచిని ఇది అందిస్తోంది. భారతదేశంలో ఐరిష్ విస్కీని ఆస్వాదించే విధానంలో ఈ బ్లెండ్ ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది.

# ప్రజాస్వామ్య పాలనకు దర్పణం పడుతున్న ప్రజాదర్బారు





**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** గొల్లపూడిలో ఎమ్మెల్యే కార్యాలయంలో 50 అర్జీలు సమర్పించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనకు 'ప్రజాదర్బారు' కార్యక్రమ నిర్వహణ దర్పణం పడుతోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బారు) నిర్వహించారు. మొత్తం 50 మంది అర్జీలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణ, రైస్ కార్డులు, ఉపాధి, పెన్షన్లు, దివ్యంగుల సర్టిఫికెట్లు మంజూరు, వివిధ రెవెన్యూ సేవలు, పోలీసు సేవలకు సంబంధించి అర్జీలు వచ్చాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం (పి.జి.ఆర్.ఎస్) ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసి జవాబుదారీతనంతో పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం, సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రజలకు నాణ్యతతో కూడిన సేవలు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెడుతుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని అన్నారు.ప్రజదర్బార్ వేదికలో అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉంటారన్నారు. ఇక్కడ వచ్చే సమస్యలను నెల రోజుల వ్యవధిలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు మాధవి పై డిప్యూటీ ఈవో విచారణ

**జగ్గయ్యపేట: మార్చి 13 మేజర్ న్యూస్ :** పట్టణ పరిధిలో ఉన్న తొర్రగుంటపాలెం జిల్లా పరిషత్తు పాఠశాల ఉపాధ్యాయురాలు జీవి మాధవి భర్త రాటకొండ శ్రీనివాసరావు (విలేజ్ రెవెన్యూ అధికారి)పై వచ్చిన అభియోగాల పట్ల నందిగామ డివైఈవో విచారణ నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా మాధవి పనిచేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం జరిగిందని, కోట్లాది రూపాయల ఆస్తులను అక్రమంగా కూడా పెట్టుకోవడం తదితర వాటిని ప్రభుత్వానికి తెలియజేయకపోవడం సీసీ రూల్స్ కు విరుద్ధంగా ఉందని కనుక వారి అక్రమాలపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని జగ్గయ్యపేటకు చెందిన జావీద్ అహ్మద్ జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. డీఈఓ ఆదేశాలు మేరకు డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ విచారణ చేపట్టారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** ది.14.03.2026, శనివారం ఉదయం 8:00 గంటల నుండి 10.30 గంటల వరకూ కృష్ణలంక సెక్షన్, 33కెవి/11కెవి ఆర్టీసీ సబ్ స్టేషన్ పరిధిలో, 11 కెవి భ్రమరాంబపురం విద్యుత్ లైన్ల మరమ్మత్తులు, మైంటెనెన్సు నిమిత్తము విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని శుక్రవారం ఓ ప్రకటనలో ఏపీసీపీడీసీయల్ కార్యనిర్వాహక ఇంజనీర్ కె.వి. కొండలరావు తెలిపినట్లు ఏఈ కృష్ణలంక ఎం. రవికుమార్ తెలియజేశారు. విద్యుత్ సరఫరా నిలుపు ప్రదేశాలు : కృష్ణలంక పరిధిలో.. సతీష్ కుమార్ రోడ్డు, ఆనంద భవన్ రోడ్డు, బైరెడ్డి వారి వీధి, గంగానమ్మ గుడి రోడ్డు, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ రోడ్డు, ఫీడర్ రోడ్డు, భ్రమరాంబ పురం ఏరియా ఆయా తదితర ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని తెలియజేయడమైనది. కావున ఆ ఏరియాలలోని విద్యుత్ వినియోగదారులు సహకరించగలరు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత


**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్రీకాకుళం, కొడాలి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ శుక్రవారం చెప్పారు. మండల విద్యుత్ శాఖ ఏఈ పి.రవి కుమార్ మాట్లాడుతూ,శ్రీకాకుళం, కొడాలి 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో నెల వారి నిర్వహణ షెడ్యూల్లో బాగం గా నరఫారా నిలిచివేయబడును శ్రీకాకుళం, కొడాలి విద్యుత్తు సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఏఈ రవికుమార్ తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ కింద రూ.92.39 లక్షలు మంజూరు



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 120 లబ్ధిదారులకు తాజాగా రూ.92,39,079లు ఆర్థిక సాయం మంజూరైనట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు వెల్లడించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రీ అంబర్స్ మెంట్ చెక్కులను, లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ. సి)లను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలంలోని 13 మందికి రూ.4.71లక్షలు, మైలవరం మండలంలోని 28 మందికి రూ.12.87 లక్షలు, జి.కొండూరు మండలంలోని 24 మందికి రూ.16.50 లక్షలు, ఇబ్రహీంపట్నం మండలంలోని 14 మందికి రూ.6.04లక్షలు, విజయవాడ రూరల్ మండలంలోని 16 మందికి రూ.11.31 లక్షల రీ ఎంబర్స్ మెంట్ చెక్కులు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు అయినట్లు తెలిపారు. మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 95 మందికి రూ.51.45లక్షల రీ ఎంబర్స్ మెంట్ చెక్కులు మంజూరు అయ్యాయి. ఇవి కాక 25 మందికి రూ.40.93లక్షల ఎల్.ఓ.సిలు కూడా మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్కు 10 ప్రశ్నాపత్రాలు



**మొవ్వ మేజర్ న్యూస్ :** ఈనెల 16వ.తేదినుంచి మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ప్రశ్నపత్రాలు కూచిపూడి పోలీస్ స్టేషన్కి రావడంతో వాటిని సిఎస్, డిఓల సమక్షంలో ట్రంకు పెట్టెలలోపెట్టి కూచిపూడి పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు. కూచిపూడి ఎస్సై సి.హెచ్. సురేష్ ఆదేశాలతోరైటర్ రమేష్ సెట్.నెంబర్-1 ను భద్రపరిచారు. మండలంలోని కూచిపూడి, పెడసనగల్లు, మొవ్వ, కోసూరు, కాజ కేంద్రాల ప్రశ్నపత్రాలు కూచిపూడిపోలీస్స్టేషన్లో, నిడుమోలు కేంద్రంకు సంబంధించిన ప్రశ్న పత్రాలు గూడూరు పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు.

# ఇసుక రీచ్‌పై పంచాయతీల పర్యవేక్షణ ఉంచాలి

### సర్పంచ్ రవి ప్రసాద్

### తాగునీటి సంక్షోభంతో అల్లాడుతున్న... గ్రామస్తుడు నాగరాజు

### సొమ్ము శ్రీకాకుళంది, సోకు అమరావతిది పర్యవరణ ప్రతినిధి రామారావు




**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని శ్రీకాకుళంలోని కృష్ణానదిలో ఇసుక రీచ్ నిర్వహణ కొరకు విజయవాడకు చెందిన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం వారి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు ఈఈ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించారు. బందరు ఆర్డీవో సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ పై ఎస్వీ ఎన్విరో ల్యాబ్స్, రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు శ్రీకాకుళం ఇసుక రీచ్ కార్యనిర్వాహఖ సంక్షిప్త వివరణ చదివి వినిపించారు. స్పందించిన సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ మాట్లాడుతూ మా పంచాయతీలో ఇసుక రీచ్ నిర్వహిస్తున్నప్పుడు వాహన రేటును బట్టి కొంత చెల్లిస్తే ఆదాయం వస్తుందని, తీర్మానాలు కావాలంటే పంచాయతీది కావాలా అంటూ ప్రశ్నించారు. ఇసుక రీచ్ పై పర్యవేక్షణ పంచాయతీకి ఇవ్వాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు మాట్లాడుతూ మా లంక భూముల్లో పంటలు పండించుకోవడానికి ఇసుక మేటలు తొలగించుకోవడానికి అనుమతులు ఇవ్వని అధికారులు ఇప్పుడు శ్రీకాకుళం ఇసుక రీచు ఎలా అనుమతిస్తారని నిలదీశారు. ఇసుక రీచ్ కొరకు 30 హెక్టార్లు లేదని వాపోతే గుర్తించామంటున్న వారు అక్కడ అంతభూమి లంకభూములను తవ్వేస్తారా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్ల ప్రమాదకరంగా ఉన్న ఇసుకను ఎవరు తొలగిస్తారని తక్షణమే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ ప్రతినిధి జేటీ రామారావు మాట్లాడుతూ సొమ్ము శ్రీకాకుళంది, సోకు అమరావతిది అన్న చందాన శ్రీకాకుళం ఇసుకరీచ్ పని ఉందన్నారు. నిబంధనల ప్రకారం ఇసుక తరలించాలని, ఉప్పునీరు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, సీసీ టీవీలు, డ్రోన్ కెమెరాతో పర్యవేక్షించాలని, ఓ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామానికి చెందిన ఆత్కూరి నాగరాజు మాట్లాడుతూ మా గ్రామంలో చేతిపంపులు, మోటర్లకు నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, ఇసుక తవ్వకాలు జరిగితే ముదిరాజులకు, ఎస్సీలకు చెందిన లంక భూములు సాగునీరు లేక తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. తహసీల్దార్ బి. విజయ ప్రసాద్, ఎస్ఐ వేమన చందన, ఆర్ కె.శ్రీనివాస్, వీఆర్వో దగాని గోపి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎం.పి.ఏ విద్యార్థికి ఆర్థిక సహాయం



**మొవ్వ మేజర్ న్యూస్:** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠంలో ఎం.పి.ఏ విద్యార్థికి రిలయన్స్ ఉన్నతోద్యోగి దంపతులు శుక్రవారం 5వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విశాఖపట్నం రిలయన్స్‌లో ఉద్యోగిగా కొనసాగుతూ బెంగుళూరు బదిలీ అయిన వంకాయల రవికిరణ్ కారులో ఒంగోలు మీదుగా వెళుతూ మార్గమధ్యంలోనికూచిపూడి సందర్శించారు. ఆయన తన భార్య కాంతితో కలిసి కళాశాల సందర్శించి కొనసాగుతున్ననాట్య తరగతులకు సంతృప్తి వ్యక్తం చేస్తూ ఎంపీఏ విద్యార్థి కి 5వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రిన్సిపాల్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, టీచింగ్ అసిస్టెంట్ పసుమర్తి హరినాథ శాస్త్రి, గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరపు వెంకటేశ్వర పణికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి కిరణ్ కాంతి దంపతులను ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు బృందం శాలువాతో సత్కరించారు.

## 10 పరీక్షలకు సర్వం సిద్ధం




**మొవ్వ మేజర్ న్యూస్:** మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాలలో ఈనెల 16వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు గదులను సిద్ధం చేస్తున్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలను నిర్వహించే కేంద్రాలలో గదికి 20 మంది చొప్పున విద్యార్థులు పరీక్షలు రాస్తారు. దానికోసం నెంబర్లువేసి గదులను తీర్చిదిద్దారు. కూచిపూడి హై స్కూల్ లో చినమత్తేవి, వేదిక్ శ్రీ మేధా హైస్కూల్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. పెడసనగల్లు కేంద్రంలో భట్ల పెనుమర్రు, మొవ్వ కేంద్రంలో హోలీ స్పిరిట్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, కోసూరు కేంద్రంలో వినయశ్రీ సన్ ఫ్లవర్ పబ్లిక్ స్కూల్, పెదముత్తేవి ఓరియంటల్ హై స్కూల్ విద్యార్థులు, కాజ కేంద్రంలో గుడ్ షెప్పర్డ్ హైస్కూల్ విద్యార్థులు, నిడుమోలు కేంద్రంలో జె ఎఫ్ డి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని మండల విద్యాశాఖ అధికారులు ఏ. భాను ప్రకాష్, శ్రీలక్ష్మి లు వివరించారు.

## ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయండి

### టెన్త్ విద్యార్థులకు ఎమ్మెల్యే సూచన



**పామర్రు మేజర్ న్యూస్:** విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాయాలని పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా సూచించారు. మండల పరిధిలోని అడ్డాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష అట్టలను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు పదవ తరగతి పునాది వంటిదని, ఈ పరీక్షలలో ఉత్తమ మార్కులను సాధించడం ద్వారా పై తరగతులలో ప్రవేశాలకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. అటువంటి ప్రాధాన్యత కలిగిన పదవ తరగతి పరీక్షలను విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా రాయడం ద్వారా ఉత్తమ మార్కులను సాధించాలని కోరారు. విద్యార్థులు సెల్ ఫోన్ వాడకుండా పరీక్ష సమయంలో చక్కగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవడం ద్వారా తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 37 మంది విద్యార్థిని విద్యార్థులకు తానా సహకారంతో సమకూర్చిన పరీక్ష అట్టలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహనరావు, ఉపాధ్యాయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనసేన నాయకులతో బండి రామకృష్ణ సమావేశం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ ఇన్చార్జి డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలోని వివిధ హోదాలో ఉన్న నాయకులు మండల పట్టణ డివిజన్ ఇన్చార్జిలు జనసేన పార్టీ శ్రేణులు వీర మహిళలతో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై చర్చించారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ జెండా ఉదయం 8గంలకు ఆవిష్కరించి అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి పట్టణ పరిధిలో వివిధ సెంటర్లలో ఏర్పాటుచేసిన జనసేన పార్టీ జెండాలను ఆవిష్కరించి పరాస్ పేట లోని సువర్ణ కళ్యాణ మండపంలో సభ 11గం లకు నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమానికి మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రాము, వివిధ నియోజకవర్గాల ఇన్చార్జులు జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు రాష్ట్ర చైర్మన్లు పాల్గొంటారని తెలిపారు.

## గ్రామీణ వైద్యుల సేవలు అనన్య సామాన్యం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (గవర్నమెంట్ హాస్పిటల్) సూపరింటెండెంట్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టి. లీల ప్రసాద్ ని రాష్ట్ర గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిఆర్ ఆంజనేయులు సారథ్యంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ వైద్యుల సేవలు అనన్యసామాన్యమని, వారి సేవలను ఇలాగే కొనసాగించాలని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు బి.ఆర్ ఆంజనేయులు, గౌరవాధ్యక్షులు ఎ.కోటీశ్వర రావు ప్రధాన కార్యదర్శి నందగోపాల్ జాయింట్ సెక్రెటరీ సందీప్ కుమార్ కోశాధికారి డేవిడ్ రాజు,జిల్లా కోశాధికారి వాసుదేవ మూర్తి,మండల అధ్యక్షులు శేషగిరి, మండల కోశాధికారి రత్తయ్య, కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు, విజయసాయి, అర్జున్ రావు, దుర్గారావు, రాజేష్ జవహర్, పెడన కార్యదర్శి సూరప రాజు తదితరులు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ను ఘనంగా సన్మానించారు.

## ఈనెల 16వ తేదీ నుండి హాఫ్ డే స్కూల్స్

### కృష్ణాజిల్లా డిఇఓ యు వి సుబ్బారావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 16వ తేదీ అనగా సోమవారం నుండి అన్ని యాజమాన్యాలలోని పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించడం జరుగుతుందని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు ఉత్తర్వులు జారీ చేసినట్లు కృష్ణాజిల్లా డిఇఓ యువి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలుగా లేని పాఠశాలలు ఉదయం పూట, పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం నుండి పనిచేయాలని తెలియజేసారు. ఒంటిపూట బడులు ఉదయం 8 గంటల నుండి 12:30 గంటల వరకు కొనసాగుతాయ న్నారు. మధ్యాహ్నం భోజనము మధ్యాహ్నం 12:30 తర్వాత ఏర్పాటు చేయవలెనని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు.

## పల్లె ప్రజల ఆరోగ్యానికి రూరల్ క్లినిక్‌లు శ్రీరామరక్ష

### కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** పల్లె ప్రజల ఆరోగ్యానికి రూరల్ క్లినిక్ లు శ్రీరామరక్ష అని కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు. మచిలీపట్నం నార్త్ మండలం గోకవరం గ్రామంలో శుక్రవారం గోపు సత్యనారాయణ, మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపి చందు క్లస్టర్ ఇంచార్జి లంకే శేషగిరి లతో కలిసి 36 లక్షల రూపాయలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా "గోపు" మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామాల్లోని ప్రజలకు ఇంటింటికీ ఆరోగ్య సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా వారికి వైద్య సేవలు అందుబాటులో తేవడానికి రూరల్ క్లినిక్స్ ప్రారంభిస్తోందన్నారు. ఈ రూరల్ క్లినిక్ లు గ్రామీణ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామ అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, యుగంధర్ రెడ్డి, భానుమూర్తి, సత్యవతి, మండల ప్రజా పరిషత్ అధికారి బాలకృష్ణ, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నగేష్,అసిస్టెంట్ ఇంజనీర్ హరిబాబు, హెల్త్ సెక్రటరీలు స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్లక్ష్యపు నీడలో నగరపాలక సంస్థ.!?

## వృధాగా పోతున్న తాగునీరు.

## ఇంజనీరింగ్ అధికారుల అలసత్వమా?

## కమిషనర్ నిర్లక్ష్యమా...?



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** నగరంలో వేసవి తీవ్రత పెరుగుతోంది. మండే ఎండల్లో మంచినీటి కోసం జనం పరితపిస్తున్నారు. ఇప్పటికే రోజు విడిచి రోజే నగరంలో, చుట్టుపక్కల మంచినీటి సరఫరా జరుగుతోంది. ఆ నీరు కూడా బురదమయమై వస్తున్నాయి. అసలే వివిధ రకాల రోగాలతో అనునిత్యం సతమతమవుతున్న సామాన్య మానవుడు ఇటు నగరపాలక సంస్థ అధికారులు విడుదల చేసే తాగునీరు తాగలేక, మినరల్ వాటర్ కొనలేక, నానా అగచాట్లు పడుతున్నాడు. అయినా నగరపాలక సంస్థ తన మొద్దు నిద్రని, నిర్లక్ష్యాన్ని వీడలేదు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ వారి కార్యాలయానికి కనుచూపుమేరలోనే ఇంతటి నిర్లక్ష్యపు నీడలు వెంటాడుతుంటే నగరంలో మిగిలిన చోట్ల పరిస్థితి ఏమిటో? అధికారుల సిబ్బంది పనితీరు ఎలా ఉందో? ఒక్కసారి ఆలోచించుకోవచ్చు. అసలే గుక్కెడు నీళ్లు దొరకక జనం అలమటిస్తుంటే, కలెక్టరేట్ సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్ద త్రాగే నీరు వృధాగా మురుగు కాలవ పాలవుతున్నా నగరపాలక సంస్థ మొద్దు నిద్ర వీడలేదని నగర ప్రజలు అనుకోవడం గమనార్హం. దాదాపు మూడు గంటలకి పైగా నిరంతరాయంగా, వృధాగా నీరు మురుగునీటి పాలైనా నగరపాలక సంస్థ సిబ్బందికి చీమైనా కుట్టలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రోజువిడిచి రోజు గృహ అవసరాలకు నీరు వదిలే నగరపాలక సంస్థ సిబ్బంది పట్టుమని అరగంట కూడా, తాగునీరు వదలలేని దుస్థితిలో ఉన్నారు. అలాంటిది గంటలకొద్దీ నీరు వృధాగా నేలపాలవుతుంటే గమనించే నాధుడు లేక అటుగా వెళ్లిన ప్రజానీకం, బిత్తర చూపులు చూడాల్సిన పరిస్థితి దాపురించింది. సిబ్బంది ఇంతటి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుంటే కమిషనర్ చూసి చూడనట్లుగా వ్యవహరించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆ డివిజన్ కార్పొరేటర్, ఇంచార్జ్ లు స్పందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వృధాగా పోతున్న మంచినీటి లీకేజీని కట్టడి చేసి స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందేలాగా చర్యలు తీసుకుంటే ఆ డివిజన్ ప్రజలు సంతోషిస్తారు.

**కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న స్పెషల్ ఆఫీసర్ల పాలన:**

నగరపాలక సంస్థకి మరి కొద్ది రోజుల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన ప్రారంభం కానుంది. నగరపాలక సంస్థకి స్పెషల్ ఆఫీసర్ గా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని ప్రభుత్వం నియమించింది. పాలనాదక్షులు, స్ఫూరద్రూపి, నగరాభివృద్ధి ద్యేయంగా పనిచేస్తున్న ప్రత్యేక అధికారిగా నియమింపబడిన జిల్లా కలెక్టర్ డైనమిక్ అధికారిగా పేరుగాంచారు. కృష్ణా జిల్లా కలెక్టర్ నగరపాలక సంస్థను గాడిలో పెడతారని ఆశిద్దాం.!

# ఏపీ మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్ రెంటపల్లి శ్యామ్‌కు శుభాకాంక్షలు





## టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ఏపీ మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన టిఎన్‌టియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెంటపల్లి శ్యామ్ శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి జంపాల సీతారామయ్యని ఇబ్రహీంపట్నంలోని వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి తన నియామకంకు అన్ని విధా లుగా సహకరించినందుకు రెంటపల్లి శ్యామ్ ధన్య వాదాలు తెలిపారు. శ్యామ్‌ను జంపాల సీతారామ య్య దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి అభినం దనలు శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా జంపాల మాట్లాడుతూ... శ్యామ్ కు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుతున్నాను అన్నారు. తనకి ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారు. టిడిపి పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు తప్పకుండా లభిస్తుంది అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కూచిపూడి దిలీప్ స్వతంత్ర కుమార్, పులి దాసు, దోప్పల బుజ్జి , విటిపిసి నాయకులు మండప్పు దుర్గారావు ఆలూరి సాంబ శివరావు కో ఆప్షన్ సభ్యులు మాబు సుభాని, స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్, జిల్లా టిడిపిల ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

## ఎమ్మెల్యే కుమార్ రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ, జిల్లా టిడిపి అధ్యక్షులు గురుమూర్తి



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థు లకు ఉచితంగా పరీక్షల అట్టలను పంపిణీ చేశారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ల ఆధ్వర్యంలో ప్రతిభ సివిల్స్ అకాడమీ సహకారంతో నియోజకవర్గ పరిధిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఈ పరీక్ష అట్టలను అందిస్తున్నట్లు కార్యక్రమంలో పాల్గొన్న పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు తొలిమెట్టుగా ఉన్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రగతిని సాధించాలని సూచించారు. భవిష్యత్తు కాలంలో పదవ తర గతి సర్టిఫికెట్‌కు ఉన్న ప్రాధాన్యతను ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మండలంలోని 118 మంది విద్యార్థులకు పరీక్ష అట్టను అందజేశారు. ప్రతిభ సివిల్స్ అకాడమీ చైర్మన్ జంపాన సుధాకర్ ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, గ్రామ మాజీ సర్పంచ్ జక్కా శ్రీనివాసరావు, తెలుగు మహిళా నాయకులు మైనేని ఇందిర, ఎంఈఓ లు వెంకటేశ్వరరావు, సురేష్, పద్మవాణి, భానుప్రకాష్, శ్రీలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వై.ఎస్.ఎన్ ప్రసాద్, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ వీరంకి రేవతి తదితరులు పాల్గొన్నారు. తొలత పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహం వద్ద ఎమ్మెల్యే కుమార్ రాజా, గురుమూర్తి, కొనకళ్ళ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీతో రుద్రరాజు భేటీ

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో సీడబ్ల్యూసీ సభ్యులు, ఏపీసీసీ పూర్వ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు శుక్రవారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో మణిపూర్‌లోని "సంఘటన్ సృజన్ అభియాన్"పై చర్చించారు.

## ఘనంగా ఏకదశ వార్షిక వైభోత్సవాలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ చిట్టి పిళ్ళారయ్య స్వామి వారి దేవ స్థానం బుట్టాయిపేటలో శ్రీ వల్లభాం బ సమేత మహాగణపతి పంచయ తన క్షేత్రములో ఏకా దశవార్షిక వై భోవోత్సవములు ఘనంగా నిర్వహి స్తున్నారు. దీనిలో భాగంగా బుధవా రం గణపతి పూజ, బాల త్రిపుర సుందరి అమ్మవారి అభిషేకం, అర్చన సువాసినీలచే లలిత సహస్రనామ పారాయణం, కుమారి పూజ, సువాసిని పూజ, చండి హోమము తిలకించడానికి అశేష సంఖ్యలో భక్తులు దేవాలయానికి విచ్చేశారు. ఘనా పాటి విష్ణుభట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వశాంతి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదివారం వరకు జరిగే కార్యక్ర మాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని సేవకులు మాదిరెడ్డి అంజిబాబు తెలిపారు.

## వీరంకిలాకు పి.హెచ్.సిలో హెచ్ పివి టీకాలు



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండలంలో 14 సంవత్సరముల నిండిన బాలికలందరికి హెచ్ పివి టీకాలను వేస్తున్నామని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.అఖిల తెలిపారు. హెచ్ పివి టీకాల కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలికలకు ఈ టీకాలు వేశారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ను అరికట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వము ఉచితముగా ఈ టీకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ టీకా తీసుకోవడం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని, తప్పనిసరిగా అర్హులైన బాలికలంతా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అఖిలతో మరో వైద్యాధికారిని డాక్టర్ సైరా, సిహెచ్ఓ ఏవివి లక్ష్మి, హెచ్.వి దేవకమలం, హెచ్ ఎస్ కృష్ణ మోహన్, స్టాఫ్ నర్స్ లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రంజాన్ చివరి శుక్రవారం శాంతియుత నిరసన




**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం ఖుద్స్ డే సందర్భంగా మండల పరిధిలోని అలీనఖిపాలెం లో ముస్లిం సోద రులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మసీదు ప్రాంగణంలో పాలస్తీనా ముస్లింలు, ఆదేశ స్వాతంత్ర్యం కోరుతూ శాంతియుత నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మత గురువు మీర్జా ఇబ్రహీం ఆలీ ఇస్ఫెహానీ మాట్లాడుతూ 1979లో ఇరాన్ విప్లవం తర్వాత అప్పటి షియాలు తమ సుప్రీం నేత అయిన ఆయుతుల్లాహ్ ఖుమేని రంజాన్ మాసం చివరి శుక్రవారం రోజున ప్రపంచంలోని ముస్లింలందరూ పాలస్తీనా స్వాతంత్ర్యం కోసం, ఇజ్రాయిల్ దేశ ఆక్రమణంలో ఉన్న మస్జిదే అక్సా స్వాతంత్ర్యం కో సం నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారన్నారు. సామ్రాజ్యవాద అమెరికా, ఇజ్రాయిల్ దేశాల నిరంకుశ ధోరణి, అమాయకులైన పాలస్తీనా ముస్లింలపై ఇజ్రాయిల్ మరణ హోమాన్ని ఆపాలని ఆయన పిలుపునిచ్చారని తెలిపారు. ఆ ఫత్వా ప్రకారం ఈ నిరసన ప్రదర్శన చేపట్టినట్లు చెప్పారు. ఐక్యరాజ్య సమితి పాలస్తీనాకు స్వయం ప్రతిపత్తి హోదా ఇవ్వాలని ఈ సంద ర్భంగా మత గురువు మీర్జా ఇబ్రహిమ్ ఆలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో అంజుమన్ అధ్యక్షుడు మీర్జా ఆలీ హైదర్, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష చేసిన ఎమ్మెల్యే



పామర్రు మేజర్ న్యూస్ : పామర్రు లోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కారం దిశగా కీలక సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా గతంలో ఇళ్ల స్థలాల విషయంలో ఏర్పడిన సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరంగా పరిశీలించారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని నమ్మించి, కాగితాలపై చూపించి ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని మోసం చేశారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం పామర్రు పంచాయతీ పరిధిలోని ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూములు ప్రజలకు దూరంగా ఉండటంతో పాటు అక్కడ నీరు, విద్యుత్, రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని కూడా అధికారులకు వివరించారు. ప్రజలకు లబ్దిచేకూరేలా పారదర్శకంగా ఇళ్ల స్థలాల కేటాయింపుపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 2014 నుండి 2019 మధ్యకాలంలో మంజూరైన హౌసింగ్ బిల్లులు, 2019 చివరలో బిల్లులు చెల్లించబడక మిగిలిపోయిన లబ్ధిదారుల వివరాలను సేకరించి వారికి పెండింగ్ బకాయిలను చెల్లించుటకు ప్రణాళికలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పామర్రు డి ఈ శివప్రసాద్ పామర్రు, మొవ్వ, పెదపారుపూడి ఏఈలు పి.పవన్ కళ్యాణ్, జి.వంశీ, ఫణీంద్ర, తూర్పు కృష్ణా డెల్టా కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, గృహ నిర్మాణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగిసిన నైపుణ్య శిక్షణ కార్యక్రమం



జగ్గయ్యపేట రూరల్, మార్చి13, మేజర్ న్యూస్: మండలంలో గరికపాడు గ్రామంలో ఉన్న డాక్టర్ కె.ఎల్. రావు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల రైతులకు ఉద్యాన నర్సరీ యాజమాన్య పద్ధతులపై నిర్వహిస్తున్న ఐదవ రోజు నైపుణ్య శిక్షణ కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా పూర్తయింది. ఈ శిక్షణకు హైదరాబాద్‌లోని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి – జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ అకాడమీ ఆర్థిక సహకారం అందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి. మంజువాణి రైతులకు అలంకార మొక్కలు, పూల తోటల పెంపకంలో అనుసరించాల్సిన వివిధ ప్రవర్ధన పద్ధతు లు, మొక్కల పెరుగుదల నియంత్రకాల వినియోగం, నర్సరీలలో సమగ్ర కీటక, తెగుళ్ల యాజమాన్య పద్ధతులను అత్యంత విపులంగా వివరించారు. కార్యక్రమ ముగింపు వేడుకలో జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ అకాడమీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కుల్దీప్ శివజీరాం చౌదరి, శాస్త్రవేత్త డాక్టర్ పి. సుప్రియా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రవి కిషోర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి రైతు ఒక వ్యవస్థాపకుడిగా ఎదిగి ఇతరులకు ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. కోర్సు డైరెక్టర్, ఉద్యాన విభాగ శాస్త్రవేత్త డాక్టర్ కె. లక్ష్మీకళతో పాటు శాస్త్రవేత్తలు డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ జశ్వంత్ రెడ్డి, డాక్టర్ వెంకట రెడ్డిలు పాల్గొని రైతులకు ధ్రువీకరణ పత్రాలు, వ్యవసాయ ఉత్పాదకాలను పంపిణీ చేశారు. ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం తమకు ఎంతో మేలు చేస్తుందని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంతో కార్యక్రమం ఘనంగా ముగిసిందని శాస్త్రవేత్తలు తెలిపారు.



# రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలి

**బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుంటూరు నాగేశ్వరరావు**

**కాన్షిరాం 92 వ జయంతిని జయప్రదం చేయండి**

ఘంటసాల, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని కొడాలి పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షులు కంచర్ల మురళీమోహన్ అధ్యక్షతన జిల్లా అధ్యక్షులు గుంటూరు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ. 15 న కృష్ణా జిల్లా ఉయ్యూరు ప్రధాన సెంటర్ "వేదిక నేషనల్ కన్వెన్షన్ హాల్ లో బహుజన్ సమాజ్ పార్టీ సెంట్రల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ కాన్షిరామ్ 92వ జయంతిని జయప్రదం చేయాలని పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తరలి రావాలని కార్యవర్గ సభ్యులను కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు జయ ప్రకాశ్ మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో బహుజన్ సమాజ్ పార్టీ జెండా రెపరెపలాడే విధంగా నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో అనేకమంది అభ్యర్థుల్ని గెలిపించడం, బహుజన సమాజ్ పార్టీ ప్రతిష్టను ఇనుమడింపచేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నియోజకవర్గ అధ్యక్షులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గంలో పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అనేక స్థానాల్లో బహుజన సమాజ్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మండల అధ్యక్షులు మురళీమోహన్ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ కార్షు శ్రీ రామ్ ఆశయమైన రాజ్యాధికారాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని తెలిపారు. మండల నాయకులు జయపాలుడు, మహిళా నాయకులు చుట్టూరి వెంకటేశ్వరమ్మ, మట్టా నాగార్జున, మండెల. పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



# మొల్లమాంబ జీవితం అందరికీ ఆదర్శనీయం

**ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ, మార్చి 13, మేజర్ న్యూస్ : తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జీవితం అందరికీ ఆదర్శనీయమని.. అపారమైన జ్ఞానంతో రామాయణాన్ని సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యేలా రచించి, సామాన్యులకు కూడా సాహిత్య రుచిని చూపించారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశమందిరంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ.. అధికారులతో కలిసి మొల్లమాంబ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ సాహిత్య సేవలను స్మరించుకున్నారు. మొల్ల రామాయణం నేటికీ అత్యంత ప్రాచుర్యం పొందిన, తేట తెలుగు కావ్యాల్లో ఒకటిగా నిలిచిపోయిందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, బీసీ సంక్షేమం, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.



# అన్నదాత సుఖీభవ

**రైతు ఖాతాలకు నగదు బదిలీ**

పెదన, మేజర్ న్యూస్: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతు ఖాతాలకు నగదు బదిలీ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ అనేది చిన్న, సన్నకారు రైతుల కుటుంబాలకు ఏడాదికి రూ.15 వేలు పెట్టుబడి మద్దతు అందించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మొదలుపెట్టిన సంక్షేమ కార్యక్రమం అని అన్నారు కేంద్ర ప్రభుత్వం వారి ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి లో భాగంగా ఇచ్చే రూ.6000 కు రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి దాదాపు 70 లక్షల రైతులకు ఈ పథకం ద్వారా లబ్ది చేరుతుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. చివరి భూమి వరకు నీరు అందించే లక్ష్యం గా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే కాగిత అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నియోజకవర్గంలో 24,202 మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ 4 వేలు చొప్పున 9.68 కోట్లు కేంద్ర ప్రభుత్వం వాటాగా రూ.3.87 కోట్లు మొత్తంగా రూ.13.55 కోట్లు రైతు ఖాతాలకు జమ కానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అర్జా నగేష్, శలపాటి ప్రసాదు యక్కల శ్యామలయ్య గోపి నాగబాబు ఒడుగు తులసిరావు పూసా వెంకయ్య కూటమి నాయకులు అధికారులు రైతులు పాల్గొన్నారు.

## చర్మకారులు, డప్పు కళాకారులకు పింఛన్లు



పామర్రు మేజర్ న్యూస్: చర్మకారులు, డప్పు కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయించాలని చర్మకార సేవా సంఘం నాయకులు పామర్రు శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ సంక్షేమ కమిటీ చైర్మన్ వర్ల కుమార్ రాజాకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం పామర్రు లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలసి తమ సమస్యలను ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను సంబంధిత మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి దృష్టికి తీసుకుని వెళ్లడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కూడా చర్చిస్తానని హామీ ఇచ్చారు. చర్మకార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయ కుమార్, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి కురుమ విజయ్ గోపాల్, నాయకులు కొడాలి సుదర్శనరావు, సుబ్బారావు తదితరులు ఎమ్మెల్యే కుమార్ రాజాను కలిసిన వారిలో ఉన్నారు.

## కలెక్టరేట్‌లో కాకాని ఆశయ సాధన సమితి చలివేంద్రం



విజయవాడ, మార్చి 13, మేజర్ న్యూస్ : వేసవి కాలంలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని సందర్శకులకు చల్లని మజ్జిగ అందించేందుకు కాకాని ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, కాకాని ఆశయ సాధన సమితి చైర్మన్ డా. తరుణ్ కాకాని తదితరులతో శుక్రవారం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పీ4లో భాగంగా ఇప్పటికే కాకాని ఆశయ సాధన సమితి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. వేసవి కాలంలో కలెక్టరేట్ సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సమాజానికి సేవ చేయాలనే భావంతో ముందుకు వస్తున్న స్వచ్ఛంద సంస్థలు ఇతరులకు కూడా ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు.

# ఓబీసీ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16న పార్లమెంట్ ముట్టడి



**విజయవాడ మేజర్ న్యూస్ :** ఓబీసీ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16,17, 18వ తేదీ లలో చేపడుతున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాల న్ని విజయవంతం చేయాలని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం విజయవాడ లోని ఓబీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో వరప్రసాద్ యాదవ్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సమగ్ర జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని కేంద్ర మంత్రి మండలి తీసుకున్న నిర్ణయానికి విరుద్ధంగా ఈ సంత్సరం జనవరి 22న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 33 ప్రశ్నలతో గజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈ నోటిఫికేషన్‌లోని 12వ ప్రశ్నలో గృహ యజమాని ఒకరు ఎస్సీ, ఎస్టీ లలో ఏదో ఒకటా లేదా ఇతరులా అని అడిగి, ఇతరులంటే ఓబీసీ అని అడగఖ్ఘ పోవటం ఏమిటని అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ప్రశ్నించారు. సామాజిక,ఆర్థిక సర్వేలో ఓబీసీ కుల గణన నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం గజిట్‌లోని 12వ కాలంలో ఓబీసీ అనే పదాన్ని చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 54% జనాభా కల్గి ఉన్న ఓబీసీ ల ఆర్థిక అసమానతలు తొలగించేందుకు కేంద్రంలో ఓబీసీ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని వరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. దేశంలోని అన్ని ఓబీసీ కులాల విద్యార్థులకు జాతీయ విదేశీ విద్యార్శిప్ స్కీమ్ అమలు చేయాలని కోరారు. ప్రతి ఏటా ప్రతి రాష్ట్రం నుంచి 500 మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ఇది అమలు చేయాలన్నారు. యూనివర్సిటీల్లో విద్యనభ్యసించే ప్రతి పరిశోధక విద్యార్థికి నెలకు 30 వేల రూపాయల స్టైఫెండ్ ఇవ్వాలని కోరారు. పరిశోధన విద్యకు ప్రాధాన్యత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్య లు తీసుకోవాలని వరప్రసాద్ యాదవ్ కోరారు. పార్లమెంట్, శాసనసభల్లో ఓబీసీ లకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఓబీసీ బిల్‌ను ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంట్ లో రాజ్యాంగ సవరణ బిల్ ప్రవేశ పెట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ లలో ఖాళీగా ఉన్న ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఓబీసీల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 18 న ఢిల్లీ లోని కానుస్ట్యూషన్ క్లబ్ లో " ఓబీసీ జాతీయ సదస్సు "ను నిర్వహిస్తున్నట్లు వరప్రసాద్ యాదవ్ తెలిపారు. ఈ సదస్సు లో కేంద్రమంత్రులు, ఎంపీ లు, వివిధ పార్టీల జాతీయ నాయకులు, పాల్గొంటారు. అలాగే రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బీద మస్తాన్ రావు, పాక సత్యనారాయణ లు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని వరప్రసాద్ యా దవ్ పేర్కొన్నారు. ఓబీసీ ల రాజ్యాంగ బద్ధమైన హక్కులను సాధించుకునేం దుకు ఓబీసీ విద్యార్థులు, యువత, మహిళలు, ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున చలో ఢిల్లీకి తరలి రావాలని వరప్రసాద్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో ఓబీసీ సంక్షేమ సంఘం ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నవ సుబ్బారావు, ఏపీ రాష్ట్ర కార్యదర్శి పీరయ్య, ఏపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ మనుబర్తి లలిత, నగర అధ్యక్షురా లు రూప, గుంటూరు నగర అధ్యక్షురాలు శైలజ,జాతీయ కార్యవర్గ సభ్యులు బత్తుల కాశీవిశ్వనాథ్, ఏపీ రాష్ట్ర ఓబీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్ కొరత లేదు..




**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 13, మేజర్ న్యూస్ :** జిల్లాలో వంట గ్యాస్‌కు కొరత లేదని.. బాట్లింగ్, సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేదని, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించేందుకు ప్రయత్నించినా, బ్లాక్ మార్కెటింగ్ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్‌డీవోలు, పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) బాట్లింగ్ ప్లాంటును ఆకస్మికంగా సందర్శించారు. ప్లాంటు అధికారులతో సమావేశం నిర్వహించి ప్లాంటు కార్యకలాపాలను, ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో అవసరానికి సరిపడా ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు ఉన్నాయని, సరఫరా ప్రక్రియ కూడా సజావుగా కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చర్యలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో వంట గ్యాస్ కొరత ఉన్నట్లు కొన్ని అపోహలు వ్యాప్తి చెందుతున్నాయని, అలాంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. గ్యాస్ సరఫరా విషయంలో ప్రస్తుతానికి ఎలాంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు, సరఫరా సంస్థలు వినియోగదారులకు సమయానికి సిలిండర్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో వంట గ్యాస్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మనదగ్గర ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ మూడు బాట్లింగ్ ప్లాంటులు ఉన్నాయని.. రోజుకు లక్షల్లో బాట్లింగ్ చేసే సామర్థ్యం వీటికి ఉందన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలో రోజుకు 16 వేల సిలిండర్లు అవసరం కాగా.. ఏ సమయంలోనైనా దాదాపు 25,500 సిలిండర్లు సిద్ధంగా ఉంటాయని వివరించారు. అందువల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితి ఉంటే ముందే తెలియజేస్తామని తెలిపారు. బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏజెన్సీలు కూడా అనవసరంగా ఎవరినీ ఆందోళనకు గురిచేయొద్దని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే క్రిమినల్ కేసులు కూడా పెట్టేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 9154970454కు కాల్ చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్‌డీవో టీవీ సతీష్, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు తదితరులు ఉన్నారు.

# ఐక్యూ జెడ్11ఎక్స్ ఆవిష్కరణ

**గుంటూరు, మార్చి 13, మేజర్ న్యూస్ :** హై-పర్‌ఫార్మెన్స్ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ భారత్‌లో ఐక్యూ జెడ్11ఎక్స్‌ను ఆవిష్కరించింది. చదువు, వినోదం, తమ లక్ష్యాలను సమతుల్యం చేసుకునే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ ఫోన్, సెగ్మెంట్‌లో ముందంజలో ఉన్న బ్యాటరీ, శక్తివంతమైన ప్రాసెసింగ్ సామర్థ్యాలు, సాఫీగా మల్టీటాస్కింగ్ చేయడానికి అనువైన పనితీరుతో పాటు మెరుగైన దృఢత్వాన్ని అందిస్తుంది. ఈ రోజుల్లో విద్యార్థుల వేగవంతమైన జీవనశైలికి అనుగుణంగా రూపొందించిన ఈ డివైస్, రోజంతా వారికి ఉత్పాదకత, వినోదం, కనెక్టివిటీని అందిస్తుంది. ఐక్యూ జెడ్-సిరీస్‌ను మరింత బలపరిచే ఈ సెగ్మెంట్‌లో అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్ అయిన ఐక్యూ జెడ్11ఎక్స్ మీడియా టెక్ డైమన్సిటీ 7400 – టర్బో ప్రాసెసర్‌తో పని చేస్తుంది. ఇది అనుటుటులో 10 లక్షలకు పైగా స్కోర్ సాధిస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో సెగ్మెంట్‌లోనే అతిపెద్ద 7200 ఎంఏహెచ్ బ్యాటరీ ఉండి, 44డబ్ల్యు ఫ్లాష్ చార్జ్ సపోర్ట్‌తో వస్తుంది. ఇది ఐపీ68 & ఐపీ69+ డస్ట్, వాటర్ రెసిస్టెన్స్, మిలిటరీ-గ్రేడ్ డ్యూరబిలిటీతో వస్తుంది. ఫోన్‌లో 50 ఎంపీ సోనీ ఏఐ-పవర్డ్ ప్రధాన కెమెరా ఉండి, ముందు, వెనుక కెమెరాలతో 4కే వీడియో రికార్డింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. ఓరిజన్‌ఓఎస్ 6 పై పనిచేసే ఈ డివైస్ ఏఐ ఫీచర్లను సపోర్ట్ చేస్తుంది. 2 సం.ల ఓఎస్ అప్డేట్లు, 4 సంవత్సరాల సెక్యూరిటీ అప్డేట్లు అందిస్తారు.

# ముదిరాజ్ కార్పొరేషన్ వెంటనే ప్రకటించాలి

**ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నారాయణ**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ మారేష్ ఆధ్వర్యంలో ముదిరాజ్ మహాసభ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ముదిరాజ్ మహాసభ గౌరవ అధ్యక్షులు కొర్ని నారాయణ ముదిరాజ్ హాజరైనారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ముదిరాజులకు కార్పొరేషన్ ప్రకటించి వారి ఆత్మ గౌరవాన్ని గౌరవించాలని కోరారు ముదిరాజ్ జనాభా ప్రకారం రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలలో ముదిరాజులకు సముషిత స్థానం కల్పించాలని కోరుతున్నాను గత ప్రభుత్వం ముదిరాజులకు ఎమ్మెల్యే తదుపరి మంత్రి పదవి ఇచ్చి గౌరవించింది కూటమి ప్రభుత్వం ముదిరాజులలో సమర్ధుడైన నాయకుడికి ఎమ్మెల్సీగా ఇచ్చి గౌరవించాలని కోరుతున్నాం ముదిరాజ్ మహాసభ తరపున రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్ సోదరులకు ఉగాది కానుకగా ముదిరాజ్ డైరీ ని అందజేయబోతున్నామని తెలియజేస్తున్నాను ముదిరాజుల హక్కుల కోసం ముదిరాజ్ మహాసభ రాజీలేని పోరాటం చేస్తుందని తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారిష్ మాట్లాడుతూ ముదిరాజ్ జాతి లో ఉన్న ప్రతి ఒక్కరు చదువుకోవాలని చదువుకు ఎవరో కూడా దూరం కాకూడదని తెలియజేస్తున్నాను రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజుల విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని తర్వాత గతిన ముదిరాజ్ కార్పొరేషన్ ప్రకటించాలని కోరుతున్నాము వారి జనాభా ప్రకారం ముదిరాజ్ కార్పొరేషన్ బడ్జెట్ కేటాయించాలని కోరుతున్నాను బీసీ డీ నుంచి బీసీ కి ఏ కు మార్చే ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుటుంబ సభ్యులు కోటేశ్వరరావు ముదిరాజ్, వెంకటేష్ ముదిరాజ్ పలువురు బిసి కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**విజయవాడ, మార్చి 13, మేజర్ న్యూస్ :** ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని.. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులు సజావుగా పరీక్షలు రాసేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. డీఈవో ఎల్.చంద్రకళతో కలిసి కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 13,909 మంది బాలురు, 13,451 మంది బాలికలు మొత్తం 27,360 మంది విద్యార్థులకు 149 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుందని.. విద్యార్థులను ఉదయం 8.30 గంటల నుంచి అనుమతించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి డిజిటల్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకొని రాకూడదన్నారు. పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్లుగా ప్రకటించడం జరిగిందని.. 144 సెక్షన్ అమలుచేయనున్నట్లు పేర్కొన్నారు. వెయ్యి మీటర్లలోపు జిరాక్సు షాపులు తెరిచి ఉండకూడదని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపించి ఆర్‌టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం పొందవచ్చన్నారు. ఎన్నడూ లేని విధంగా గౌరవ సీఎం, గౌరవ విద్యాశాఖ మంత్రివర్యుల దార్శనికతకు అనుగుణంగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలుచేసి విద్యార్థులను పూర్తిస్థాయిలో పరీక్షలకు సన్నద్ధం చేశామని.. పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు లక్ష్మీశ తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా జిల్లాస్థాయి కంట్రోల్ రూమ్ (9154970454) నంబరుకు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

**అత్యంత పారదర్శకంగా పరీక్షల నిర్వహణ: డీఈవో ఎల్.చంద్రకళ**

పదో తరగతి పరీక్షలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహించడం జరుగుతుందని.. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్ వసతి, మంచినీరు, ఇతర అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. హాల్ టిక్కెట్‌లో పొందుపరిచిన సూచనలు పాటిస్తూ విద్యార్థులు సజావుగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబరును ఆన్సర్ స్క్రిప్ట్ లేదా ఓఎంఆర్ షీట్‌పై ఎక్కడా రాయకూడదని సూచించారు. 300 మంది సిబ్బందిని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థుల సబ్జెక్టు నైపుణ్యాలను పూర్తిస్థాయిలో మెరుగుపరిచి, పరీక్షలకు సన్నద్ధం చేసినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న (సీడబ్ల్యూఎస్ఎన్) 193 మంది విద్యార్థులకు స్క్రైబ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని.. వీరికి గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు.



# జర్నలిస్ట్ మిత్రులకు ఉగాది పురస్కారాలు

**జర్నలిస్టు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం**
**ప్రభుత్వ పరిశీలనలో జర్నలిస్ట్ పెన్షన్ స్కీమ్**
**వెటరన్ జర్నలిస్ట్లలకు వారు కోరిన జిల్లాలో ఉచిత బస్ పాస్ సౌక్యం కల్పిస్తాం**
**జర్నలిస్ట్లలకు త్వరలో శుభవార్త చెప్తాం**
**సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**



**విజయవాడ మేజర్ న్యూస్ :** జర్నలిస్ట్ మిత్రులకు ఉగాది పురస్కారాలు ఇవ్వనున్నట్లు రాష్ట్ర సమాచార సంబంధాల శాఖ కొలుసు పార్థసారథి చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలో జర్నలిస్టుల సంక్షేమానికి పలు పథకాలను ప్రభుత్వం ప్రకటిస్తుందని కొలుసు పార్థసారధి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు శుక్రవారం మంత్రిని మీడియా సెంటర్లో కలసి జర్నలిస్టుల పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ త్వరలోనే తీపి కబురు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ యాదవ్‌తో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ వెటరన్ జర్నలిస్టులు దూర ప్రాంతాల నుంచి విజయవాడ వచ్చి రాష్ట్ర కార్యాలయంలో బస్ పాసులు తీసుకోవడం వల్ల సొంత జిల్లాల్లో బస్సు సౌకర్యం కల్పించడం లేదని, వారికి సొంత జిల్లాలోనే పాసులు కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందిగా మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వెటరన్ జర్నలిస్టులకు పనిచేసే చోటే బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్యాబినెట్‌లో జర్నలిస్టుల సమస్యలపై చర్చించామని త్వరలోనే వారికి శుభవార్త చెబుతామని తెలిపారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం అవార్డుల పంపిణీతో పాటు ప్రమాద బీమా సౌకర్యం,20 లక్షలకు హెల్త్ కార్డుల పరిమితి పెంచడంతో పాటు పలు జర్నలిస్ట్ సంక్షేమ కార్యక్రమాలపై త్వరలోనే ఇది విధానము ప్రకటిస్తామని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఏ.పి. ఏం.పి. ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇస్కా రాజేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, విజయవాడ నగర అధ్యక్షులు టి అనిల్ కుమార్, జనరల్ సెక్రెటరీ జి శ్రీనివాసరావుతో పాటు పలువురు జర్నలిస్టులు ఉన్నారు.

## మంటాడలో భక్తిశ్రద్ధలతో పరిశుద్ధ శిలువ మార్గం

### యేసుక్రీస్తు శ్రమలను ధ్యానం చేస్తూ ప్రత్యేక ప్రార్థనలు





**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండల పరిధిలోని మంటాడ అంబేద్కర్ నగర్‌లో 'పరిశుద్ధ సిలువ మార్గం' కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉయ్యూరు విచారణ గురువులు మద్దాల వినయ్ కుమార్, ఆకునూరు విచారణ గురువులు ఆమీరే అజయ్ కుమార్ ముఖ్యులుగా విచ్చేసి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నడిపించారు. ఈ సందర్భంగా ఉయ్యూరు విచారణ గురువులు మద్దాల వినయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా విభూది బుధవారం నుండి ప్రారంభమయ్యే తపస్సు కాలంలో భాగంగా యేసు ప్రభువు పొందిన కష్టాలను, శ్రమలను ధ్యానం చేస్తూ ఈ శిలువ మార్గాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మన జీవితాల్లో ఎదురయ్యే బాధలను, కష్టాలను ఏ విధంగా అధిగమించాలో, శోధనలను ఎలా జయించాలో ఈ ప్రార్థనలు మనకు దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామ పురవీధుల్లో భక్తులు శిలువను మోస్తూ, భక్తి విశ్వాసాలతో ఈ కార్యక్రమంలో పాల్గొని దేవుని దీవెనలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు విచారణ పరిధిలోని 8 గ్రామాల విశ్వాసులు, అలాగే ఆకునూరు విచారణ పరిధిలోని 8 గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులతో పాటు ఉపదేశి గుదే సురేష్, సంఘ పెద్దలు గోసాల రాజు, రాంబాబు, మరియమ్మ, తులసమ్మ, ఆరోగ్యమ్మ, దేవమణిమ్మలతో పాటు ఉయ్యూరు, ఆకునూరు విచారణల ఉపదేశులు, దళ సభ్యులు ఈ ప్రార్థనలో పాల్గొన్నారు. గ్రామ పురవీధుల గుండా సాగిన ఈ శిలువ మార్గంలో భక్తులు క్రీస్తు శ్రమలను స్మరిస్తూ భక్తిగీతాలు ఆలపించారు.

## వినియోగదారుల విశ్వసనీయతే బలం...

### తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బోండా రవితేజ





**విజయవాడ మేజర్ న్యూస్ :** సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండి వినియోగదారుల విశ్వసనీయతను చూరగొనడమే వ్యాపార అభివృద్ధికి అసలైన మూలసూత్రమని ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బోండా రవితేజ అన్నారు. ఏలూరు రోడ్డు, రామ మందిరం సమీపంలో క్యాప్రి గోల్డ్ లోన్ సంస్థ నూతన శాఖను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు వ్యాపార రంగం, పారిశ్రామికవేత్తలు సహకరించాలన్నారు. వ్యాపారం తో పాటు సామాజిక బాధ్యత కూడా కలిగి ఉండాల్సిన అవసరాన్ని వ్యాపారులు గుర్తుంచుకోవాలన్నారు. నేటి పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ ఆర్థిక అవసరాలు ఎక్కువగా ఉంటాయని, అలాంటి సందర్భాల్లో తక్కువ వడ్డీ రేట్లతో, పారదర్శక విధానాలతో రుణాలు అందించే గోల్డ్ లోన్స్ అందించే సంస్థలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారు, మహిళలు, మధ్యతరగతి కుటుంబాలకు ఈ తరహా ఆర్థిక సేవలు ఎంతో మేలు చేస్తాయన్నారు. బంగారు రుణాల ద్వారా ప్రజలు తమ ఆభరణాలను భద్రపరిచి, అత్యవసర అవసరాలకు నగదు పొందగలుగుతారని, బ్యాంకింగ్ వ్యవస్థకు తోడుగా ఇలాంటి నమ్మకమైన ఫైనాన్స్ సంస్థలు పనిచేయడం అభినందనీయమని, క్యాప్రి గోల్డ్ లోన్స్ సంస్థ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, మరింత మెరుగైన సేవలు అందించి, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. నియోజకవర్గం అభివృద్ధితో పాటు, ప్రజలకు ఆర్థిక స్వావలంబన కల్పించే ప్రతి కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు. సేవా దృక్పథంతో పనిచేసే సంస్థలకు ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంటుందని, ప్రజల అవసరాలకు దగ్గరగా ఉండే ఇలాంటి సంస్థలు నియోజకవర్గంలో మరింత విస్తరించాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ షరీఫ్, విజయవాడ సెంట్రల్ ఎస్.సి. సెల్ ఉపాధ్యక్షులు కె.ఎస్.టి. కుమార్, నియోజకవర్గ ఎస్సీ సెల్ సెక్రటరీ కె.వేణు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు బెనర్జీ, బి. కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, క్యాప్రి గోల్డ్ లోన్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## సమానత్వం ఐక్యత రంజాన్ ప్రత్యేకత కోగంటి సత్యం

### పేద ముస్లింలకు హజ్రత్ సయ్యద్ షాబుఖారి ఆస్థానంలో రంజాన్ తోఫా పంపిణీ చేసిన కోగంటి సత్యం





**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లిలోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి ఆస్థానలో రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు ప్రముఖ పారిశ్రామికవేత్త కోగంటి సత్యం సౌజన్యంతో ఆస్థాన పీఠాధిపతి అల్తాఫ్ బాబా ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం తోఫా పంపిణీ ప్రారంభించారు. అనంతరం మహిళలకు 1000 చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోగంటి సత్యం మాట్లాడుతూ సమానత్వం ఐక్యత రంజాన్ యొక్క ప్రత్యేకత అని అన్నారు. తమకు ఉన్న దాంట్లో సాటివారికి సహాయపడుతూ వారికి కష్టాలలో అండగా నిలవడం ఎంతో ఆత్మ సంతృప్తిని ఇస్తుందని తెలిపారు. పేద ముస్లింలకు రంజాన్ సందర్భంగా తోఫా పంపిణీ చేయడం సంతోషకరమని అన్నారు. ప్రస్తుతానికి ఎన్నికల్లోలి పోటీచేసే ఆలోచనలేదన్నారు. సేవ మార్గంలో మా త్రమే ప్రయాణం చేస్తున్నానని చెప్పారు. అల్తాఫ్ బాబా మాట్లాడుతూ నిస్వా ర్థంతో సేవా కార్యక్రమాలకు చేస్తూ అండగా నిలవటం కోగంటి సత్యం, ప్రత్యేకత అన్నారు. ఎలాంటి స్వార్థం, లాభపేక్ష లేకుండా ఎ ప్పుడు ఆయన సేవా కార్యక్రమాలు చేయటం అభినందనీయమన్నారు. ఆ అల్లా ఆయనకు పూర్తి ఆయురారోగ్యాలు యోగక్షేమాలు ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలి పారు. కోగంటి సత్యంని ఇస్లాం సాంప్రదాయం ప్రకారం సన్మానించారు. తోఫా పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు అల్తాఫ్ బాబా భోజనం ఏర్పాటు చేశారు. కోగంటి సత్యం స్వయంగా మహిళలకు భోజనం వడ్డించారు.



## ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కలసిన సీఐలు





**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇబ్రహీంపట్నం సీఐ సుబ్రహ్మణ్యం, మైలవరం సీఐ కె.కిషోర్ బాబు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు **ఎన్.వెంకట్,** ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999